సాక్షి
మంచిర్యాల
బుధవారం : 6 : ఆగస్టు : 2025





**పర్యాటకం.. అభివృద్ధికి దూరం**
కడెం ప్రాజెక్ట్ సందర్శనకు రోజురోజుకూ పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. వీరికి తగినట్లు అధికారులు ఏర్పాట్లు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 10లో▸



**కంపుకొడుతున్న కాలువలు**
చాలా గ్రామాల్లో పూడిక తొలగించకపోవడంతో డ్రెయినేజీలు కంపుకొడుతున్నాయి. దీంతో దుర్గంధం వ్యాపించి సమీప నివాసాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. 11లో▸

గరిష్టం/కనిష్టం
33.0 /27.0

**వాతావరణం**
సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తుంది.

## న్యూస్‌రీల్

### గూడెంలో పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవాలు నిర్వహిస్తున్న అర్చకులు

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఆలయంలో మూడురోజులు నిర్వహించనున్న పవిత్రోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అఖండ దీపస్థాపన, విశ్వక్సేనారాధన, వాసుదేవా పుణ్యాహవాచనం, రుత్విక్‌వరణం, అంకురార్పణ, ధ్వజారోహణం, అగ్నిప్రతిష్ఠ, స్థాపిత దేవతా హవనములు, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ తదితర కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయ పవిత్రత, భక్తుల శ్రేయస్సు కోసం నిర్వహించే వేడుకల్లో ఆలయ ఈవో శ్రీనివాస్, యాజ్ఞికులు అభిరామాచార్యులు, వేదపండితులు నారాయణశర్మ, భరత్‌శర్మ, ప్రధానార్చకుడు రఘుస్వామి, అర్చకులు సంపత్‌స్వామి, సురేశ్‌స్వామి, రామకృష్ణస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

### అందుబాటులో ఎరువులు

నస్పూర్: జిల్లాలో సరిపడా యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయాధికారి ఛత్రునాయక్ తెలిపారు. మంగళవారం ఆయన అధికారులతో కలిసి సీతారాంపల్లి రైతువేదిక వద్ద నిర్వహించిన రైతునేస్తం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ మంగళవారం ఉదయం 10 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర శాస్త్రవేత్తల బృందం సభ్యులు రైతులకు సాగులో మెళకువలు వివరిస్తారని తెలిపారు. అనంతరం ఎరువుల దుకాణాలు, గోదాములు తనిఖీ చేశారు. ఏడీఏ అనిత, ఏవో మహేందర్, ఏఈవో తిరుపతి ఉన్నారు.

### ఆగని పోడుపోరు



ఎఫ్‌డీవో కాళ్లపై పడ్డ గిరిజనులు

దండేపల్లి: మండలంలోని తాళ్లపేట అటవీ రేంజ్ పరిధిలోగల లింగాపూర్ బీట్‌లోని 380 కంపార్ట్‌మెంట్‌లోని అటవీభూమిలో కొద్దిరోజులుగా కొందరు సమీప గ్రామాల ఆదివాసీ గిరిజనులు చెట్లపొదలు తొలగించారు. దీంతో అప్పటినుంచి అటవీ అధికారులు, గిరిజనులకు మధ్య పోడు పోరు సాగుతోంది. అటవీ, రెవెన్యూ, పోలీస్‌శాఖల అధికారులు పలుసార్లు గిరిజనులకు కౌన్సిలింగ్ ఇవ్వగా కొద్ది రోజులు ఆగినట్లే ఆగినవారు తొలకరి వర్షాలకు చెట్లపొదలు తొలగించిన భూముల్లో విత్తనాలు చల్లారు. అవి మొలకెత్తగా అటవీశాఖ అధికారులు, సిబ్బంది మంగళవారం అక్కడికి వెళ్లి వాటిని తొలగించారు. విషయం తెలుసుకున్న ఆదివాసీ గిరిజనులు అక్కడికి చేరుకుని అధికారులతో వాగ్వాదానికి దిగారు. తహసీల్దార్ రోహిత్‌దేశ్‌పాండే, లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి, దండేపల్లి ఎస్సై తహసీద్దీన్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. గిరిజనులకు నచ్చజెప్పే ప్రయత్నం చేయగా వారు వినిపించుకోలేదు. విషయాన్ని సీఐ జన్నారం ఎఫ్‌డీవో రామ్మోహన్ దృష్టికి తీసుకెళ్లగా వెంటనే ఆయన అక్కడకు చేరుకున్నారు. ఎఫ్‌డీవో రావడంతోనే కొంతమంది గిరిజనులు ఆయన కాళ్లపై పడి తాము సాగు చేసుకుంటున్న భూమి తమకివ్వాలని వేడుకోగా, వారు కుదరదని చెప్పారు. అటవీ భూములు వదిలి వెళ్లకుంటే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పొద్దుపోయేదాకా అక్కడే ఉన్నవారంతా ఆ తర్వాత వెళ్లిపోయారు.

### వానాకాలం.. సూర్యప్రతాపం



వానలు దంచి కొట్టాల్సిన ఆగస్టులోనే ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో నాలుగురోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు 35-38.6 డిగ్రీలుగా నమోదవుతున్నాయి. ఇళ్లలో ఉంటున్న జనం ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతుంటే ఇక వివిధ పనులపై బయటికి వెళ్తున్నవారి పరిస్థితి చెప్పనక్కరలేదు. జూన్ నుంచి ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 526.8 మి.మీటర్లు నమోదు కావాల్సి ఉండగా 343 మి.మీటర్లు మాత్రమే ఉంది. సగటున 35శాతం లోటు నెలకొంది. వానాకాలం ప్రారంభమై రెండు నెలలు గడిచినా ఆశించిన వానలు లేక అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

- మంచిర్యాలఅగ్రికల్చర్

# అన్నింటికీ ముఖమే!

- ఉద్యోగుల నుంచి ఉపాధి కూలీల వరకు
- ఫేస్‌రికగ్నిషన్‌తోనే విధులకు హాజరు నమోదు
- ఉపాధి హామీ పథకంలో కూలీలకు ఈకేవైసీ మొదలు
- ఈ నెల 15నుంచి పకడ్బందీగా అమలుకు ఆదేశాలు



మంగళవారం యాప్‌లో నమోదు తర్వాత చెన్నూరు మండలం చింతలపల్లిలో పని ప్రదేశంలో ఉపాధి కూలీలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/పాతమంచిర్యాల: ప్రభుత్వం ప్రజలకు మరింత పకడ్బందీగా సేవలు అందించేలా సాంకేతికతను అమలు చేస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సహా తదితర కార్యక్రమాల్లో బయోమెట్రిక్, జియో ట్యాగింగ్‌తో కూడిన హాజరు అమలు చేస్తోంది. ఉద్యోగుల ముఖం చూపిస్తేనే హాజరును ప్రామాణికంగా తీసుకుంటోంది. ఇప్పటికే గ్రామస్థాయిలో పని చేస్తున్న పంచాయతీ కార్యదర్శులకు అమలవుతోంది. ఇటీవలే విద్యాశాఖలో సర్కారు బడుల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకూ తప్పనిసరి చేసింది. ఫేస్ రికగ్నిషన్ పద్ధతిలోనే రోజువారీగా విధుల హాజరు, గైర్హాజరు పరిశీలనలు జరుగుతున్నాయి. ఉదయం పూట ఒకసారి, సాయంత్రం మరోసారి ఈ మేరకు ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నారు. ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా పంచాయతీ కార్యదర్శులకు కచ్చితంగా ముఖ గుర్తింపు విధానంలో కార్యదర్శులు తప్పుగా ఫొటోలు నమోదు చేయడంతోనే సస్పెన్షన్‌కు గురయ్యారు. జిల్లాలోనూ 21మంది పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సమాధానాలు సంతృప్తికరంగా లేనిపక్షంలో చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇక ఉపాధి హామీ పథకంలోనూ కూలీలకు ముఖ గుర్తింపు హాజరును పకడ్బందీగా అమలు చేయనున్నారు. ఇప్పటికే 'నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం(ఎన్‌ఎంఎంఎస్)' హాజరు నమోదును ఫీల్డ్ అసిస్టెంట్లు అప్‌లోడ్ చేస్తుండగా.. ఇక నుంచి మరింత పకడ్బందీగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటున్నారు.

**నమోదైన కూలీలే హాజరయ్యేలా..**

నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం సాఫ్ట్‌వేర్ యాప్ ద్వారా పనులు పారదర్శకంగా చేపట్టేలా కొత్త విధి విధానాలు రూపొందించారు. వీటి ప్రకారం పనులు నిర్వహించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో చాలాచోట్ల జాబ్‌కార్డులు ఉన్న ఇంట్లో ఒకరి పేరు మీద జాబ్‌కార్డు ఉంటే వారి బదులు మరొకరు హాజరవుతున్నారు. దీంతో వేతనాల చెల్లింపుతోపాటు పని ప్రదేశంలో ఎవరికైనా ప్రమాదం జరిగితే పరిహారం చెల్లించడం సమస్యగా మారుతోంది. దీంతో బాధిత కుటుంబాలకు ఇబ్బంది ఏర్పడుతోంది. ఈ క్రమంలో తప్పనిసరిగా జాబ్‌కార్డు ఉండి పనికి హాజరైన కూలీల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తూ ఈకేవైసీ చేస్తున్నారు. దీంతో పనికి హాజరైన కూలీ ఫొటో తీయగానే ఆధార్ నమోదై ఉన్న బయోమెట్రిక్ కారణంగా ఎవరు హాజరయ్యారో సులువుగా తెలిసిపోతుంది. రోజుకు రెండుసార్లు ఉదయం పని మొదలయ్యాక ఒకసారి, నాలుగు గంటల తర్వాత మరోసారి ఫొటో తీసుకుంటారు. ఫొటోలో ఉన్న కూలీలే హాజరైతే మస్టర్ పడుతుంది. ఫొటోల్లో తేడాలు ఉంటే మస్టర్ నమోదు కాదు. ఒక ఫొటోకు మరో ఫొటోకు తప్పనిసరిగా నాలుగు గంటల వ్యత్యాసం ఉండాలి. నమోదైన కూలీలే హాజరై పని చేయాల్సిన అవసరం ఏర్పడుతోంది. వీటితోపాటు జియోట్యాగింగ్ ప్రదేశంలో జియో ఫెన్సింగ్ అప్డేట్ చేస్తూ పని ప్రదేశాలను సైతం గుర్తించే వీలు కలుగనుంది. పాత చోట్ల మళ్లీ పనులు చేయకుండా చర్యలు తీసుకోనుంది. సిగ్నల్‌లేని, సాంకేతిక సమస్యలు ఉన్నా జిల్లా కోఆర్డినేటర్‌తో పరిష్కరించనున్నారు. కాగా, ఈ అంశాలపై జిల్లాలోని ఎంపీడీవోలు, ఉపాధి హామీ ఏపీవోలు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లకు సోమవారం కలెక్టరేట్‌లో అవగాహన కల్పించారు. ఎన్‌ఎంఎంఎస్ సాఫ్ట్‌వేర్‌కు అనుగుణంగా పనులు, కూలీల నమోదుపై వివరించారు. ఈ నెల 15నుంచి ఫేస్ రికగ్నిషన్ విధానం పకడ్బందీగా అమలయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు.

| జిల్లా ఉపాధి హామీ పథకం వివరాలు | జారీ చేసిన జాబ్‌కార్డులు 1.21లక్షలు | | |
|---|---|---|---|
| | నమోదైన కూలీలు | యాక్టివ్ జాబ్‌కార్డులు | యాక్టివ్ కూలీలు |
| | 2.38లక్షలు | 78వేలు | 1.33లక్షలు |

### పనుల్లో పారదర్శకత



ఉపాధిహామీ పనుల్లో పారదర్శకత పెంచడానికే కేంద్రం కొత్త నిబంధనలు తీసుకొచ్చింది. కూలీలు పని స్థలాల్లో పని చేస్తేనే కూలి చెల్లింపులు జరుగుతాయి. జాబ్‌కార్డు కలిగిన కూలీలే పనులకు హాజరు కావాలి. వారికే వేతనం లభిస్తుంది. కొత్త సాఫ్ట్‌వేర్‌తో పనుల్లో జరిగే అక్రమాలను నియంత్రించవచ్చు.

– ఎస్.కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

# రైతులకు యూరియా కొరత లేదు



లక్సెట్టిపేట: మాట్లాడుతున్న రాంచందర్‌రావు

- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ మధ్య అవగాహన
- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

లక్సెట్టిపేట/మందమర్రిరూరల్/దండేపల్లి: రైతులకు యూరియా కొరత లేదని, కాంగ్రెస్ ప్రభుత్వం కొరత ఉన్నట్లు సృష్టిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. మంగళవారం జిల్లా పర్యటనకు వచ్చిన ఆయనకు దండేపల్లి మండలం గూడెం వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు రఘునాథ్, నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం లక్సెట్టిపేట మండల కేంద్రంలోని ఎస్‌పీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రైతు సమ్మేళనం, మందమర్రి పాతబస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రం నుంచి 12లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందిస్తోందని, కాంగ్రెస్ అబద్ధాలు ఆడుతూ రైతులను తప్పుదారి పట్టిస్తోందని తెలిపారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్‌ఎఫ్‌సీఎల్‌ను ప్రారంభించి ఇతర రాష్ట్రాలకు పంపిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ ఏర్పడ్డాక బీఆర్‌ఎస్ రైతులకు ఏం చేయలేదని, ఆత్మహత్యలు పెరిగాయని తెలిపారు. స్థానిక ఎన్నికలు వస్తున్నాయని కాంగ్రెస్ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చిందని తెలిపారు.

**కాంగ్రెస్‌తో అభివృద్ధి శూన్యం**

చెన్నూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీతో అభివృద్ధి శూన్యమని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ఈవీఎం ఓటింగ్ ద్వారా మోసం జరిగిందని మాట్లాడుతోందని, మరి ఆ పార్టీ గెలిచిన రాష్ట్రాల్లో కూడా మోసం జరిగిందా అని ప్రశ్నించారు. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలు ముస్లిం రిజర్వేషన్ విషయంలో ఏకతాటిపై ఉన్నాయని, వారి అవగాహన బయటపడుతోందని తెలిపారు. దేశంలో నక్సలిజాన్ని అంతమొందిస్తామని, ఇప్పటికైనా ప్రాణాలు దక్కాలంటే నక్సలైట్లు జనజీవన స్రవంతిలోకి రావాలని పిలుపునిచ్చారు. మంత్రి వివేక్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఒక్కటీ నెరవేర్చలేదన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు మల్క కొమురయ్య, అంజిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు రఘునాథ్‌రావు, మాజీ ఎంపీ వెంకటేశ్‌నేత, శ్రీదేవి, నాయకులు గోమాస శ్రీనివాస్, లింగయ్య, దుర్గం అశోక్, దీక్షితులు, ఆరుముల్ల పోశం పాల్గొన్నారు.

**బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానం**

మంచిర్యాలక్రైం: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావును జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బండవరం జగన్, ఉపాధ్యక్షుడు భుజంగరావు, జనరల్ సెక్రెటరీ మురళీకృష్ణ, న్యాయవాది తుల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణను అగ్రస్థానాన నిలబెట్టిన ఘనత కేసీఆర్‌దే



హరీశ్‌రావు ప్రసంగాన్ని వీక్షిస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు

నస్పూర్: వ్యవసాయానికి అధిక ప్రాధాన్యతనిచ్చి తెలంగాణను దేశంలో అగ్రస్థానాన నిలబెట్టిన ఘనత మాజీ సీఎం కేసీఆర్‌దేనని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై మంగళవారం నిర్వహించిన పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను నస్పూర్‌లోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో డిజిటల్ స్క్రీన్‌పై వీక్షించారు. అనంతరం దివాకర్‌రావు మాట్లాడుతూ.. ప్రతీ ఎకరాకు సాగునీరందించాలనే ఉద్దేశంతో కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మించారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ దురుద్దేశంతోనే కేసీఆర్‌పై అసత్య ఆరోపణలు చేస్తోందని ఆరోపించారు. ఎన్ని కుట్రలు చేసినా బీఆర్‌ఎస్‌కు ప్రజల్లో ఉన్న ఆదరణను తగ్గించలేరని పేర్కొన్నారు.

# జాతీయ రహదారి పనులు చేపట్టండి



కేంద్ర మంత్రి గడ్కరీతో మంత్రి వివేక్, ఎంపీ వంశీకృష్ణ

చెన్నూర్: నియోజకవర్గ పరిధిలోని భీమారం–చెన్నూర్ మధ్యగల జోడువాగు 63వ జాతీయ రహదారి పనులు త్వరగా చేపట్టాలని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి మంగళవారం కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. ఈ మేరకు వివేక్ ఢిల్లీలో కేంద్ర మంత్రిని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణతో కలిశారు. జోడువాగు ఎన్‌హెచ్ 63 పనులు వేగవంతం చేయాలని గడ్కరీకి విజ్ఞప్తి చేశారు. రహదారి నిర్మాణానికి నిధులు మంజూరై ఏడాదైనా డీపీఆర్ దశలోనే ఉందని తెలిపారు. త్వరగా రోడ్డు నిర్మాణం పూర్తయితే మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు రవాణా సౌకర్యం మెరుగవుతుందని, ప్రజల ఇబ్బందులు తీరుతాయని పేర్కొన్నారు. ఎంపీ వంశీకృష్ణ మాట్లాడుతూ.. అంతర్జాతీయ రోడ్ల నిర్మాణంతో చెన్నూర్ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. తమ విజ్ఞప్తికి కేంద్ర మంత్రి గడ్కరీ సానుకూలంగా స్పందించారని, డీపీఆర్ ఆమోద పనులను స్వయంగా పర్యవేక్షిస్తానని హామీ ఇచ్చారని మంత్రి, ఎంపీ తెలిపారు.

# అవకతవకల నిరోధానికే సామాజిక తనిఖీలు



సమావేశంలో ఆరోపణలు చేస్తున్న కరుణాకర్

జన్నారం: ఉపాధి పనుల్లో అవకతవకల నిరోధానికే ఏటా సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు డీఆర్డీవో పీడీ కిషన్ పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావేదికకు హాజరై మాట్లాడారు. 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి 31వరకు చేపట్టిన పనులపై జూలై 24 నుంచి ఆగస్టు 4వరకు పంచాయతీల వారీగా సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 442 పనులకుగాను రూ.7.30 కోట్లు కూలీలకు వేతనాల రూపంలో, రూ.1.17 కోట్లు మెటీరియల్ రూపంలో ఇచ్చినట్లు తెలిపారు. 195 పంచాయతీరాజ్ రోడ్లకు రూ.5.59 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. ఇందుకు గ్రామాలవారీగా సామాజిక తనిఖీ బృందం నివేదికలు చదివి వినిపించారు. ఇందులో రేండ్లగూడలో పాత షెడ్డుకే నిధులు మంజూరు చేయించారని ఆ గ్రామానికి చెందిన దాముక కరుణాకర్ ఆరోపించగా, వివరణ ఇవ్వకపోతే డబ్బులు రికవరీ చేయాల్సి ఉంటుందని డీఆర్డీవో తెలిపారు. దుర్వినియోగమైన రూ.13వేలు రికవరీకి రాశారు. సామాజిక తనిఖీ అనంతరం జరిగిన ప్రజావేదిక సాదాసీదాగా జరిగింది. నివేదికలు చదివి వినిపించగా, డబ్బులు లెక్క తేలనివారికి రికవరీ రాశారు. ఆన్‌లైన్‌లో పనులు వివరాల నమోదుతో అక్రమాలు తగ్గినట్లు తెలుస్తోంది. కార్యక్రమంలో రాష్ట్ర టెక్నికల్ సభ్యుడు వేణు, సామాజిక తనిఖీ రాష్ట్ర కోఆర్డినేటర్ రవి, సాయిలు, ఎంపీడీవో ఉమర్ షరీఫ్, మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, ఏపీవో రవీందర్, ఈసీ విలాస్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల పనితీరు భేష్



ఆన్‌లైన్ తరగతులు పరిశీలిస్తున్న యాదయ్య

జన్నారం: విద్యార్థుల సంఖ్య పెంచి, నాణ్యమైన విద్యనందించడంలో ఉపాధ్యాయుల పని తీరు అభినందనీయమని డీఈవో యాదయ్య పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కిష్టాపూర్ ప్రాథమిక పాఠశాలలో దిక్చూచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో అమెరికా నుంచి అమలు చేస్తున్న డిజిటల్ తరగతులను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కిష్టాపూర్ విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో మొదటిస్థానంలో నిలవడం అభినందనీయమని కొనియాడారు. మారుమూల గ్రామ ప్రాథమిక పాఠశాలలో అమెరికా నుంచి ఆన్‌లైన్ తరగతులు నిర్వహించడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. గుణాత్మకమైన, సాంకేతికమైన, శాస్త్రీయమైన విద్యను అందించేందుకు ఈ కార్యక్రమం సౌకర్యవంతంగా ఉంటుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు వినియోగించుకోవాలని సూచించారు. ఫౌండేషన్ వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎంఈవో విజయ్‌కుమార్, హెచ్‌ఎంలు రామన్న, సుధాకర్‌నాయక్, సీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కమలాకర్, ఉపాధ్యాయుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

# మలుపు తిరుగుతున్న సైబర్ నేరగాళ్ల కేసు

- దేశవ్యాప్తంగా నమోదైన కేసులు
- నిందితులను అరెస్ట్ చేసిన హైదరాబాద్ సైబర్‌క్రైం పోలీసులు



ఇటీవల పోలీసుల తనిఖీల్లో దొరికిన సిమ్‌కార్డులు

జన్నారం: సైబర్‌క్రైం, రామగుండం పోలీసులు సంయుక్తంగా దాడి చేసి పట్టుకున్న సైబర్ నేరగాళ్ల కేసు మలుపులు తిరుగుతోంది. దేశవ్యాప్తంగా వారిపై కేసులు నమోదు కావడం సంచలనం సృష్టించింది. జన్నారం ఎస్సై అనూష కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపరిచారు. అనంతరం బెయిల్‌పై విడుదలైన వారిని హైదరాబాద్‌లోని రాచకొండ సైబర్‌క్రైం పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా వారికి 14 రోజులు రిమాండ్ విధించినట్లు ఓ పోలీస్ ఉన్నతాధికారి తెలిపారు. గతంలోనే హైదరాబాద్‌కు చెందిన వ్యక్తికి సదరు నిందితులు ఫోన్ చేసి రూ.10.20 లక్షలకు టోకరా వేసినట్లు సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు అందింది. ఈ మేరకు కేసు నమోదు చేయగా, జన్నారంలో పట్టుబడిన సైబర్ నేరగాళ్ల నుంచి ట్రేస్ చేసిన ఒక సెల్ నంబర్ నుంచే బాధితునికి ఫోన్ కాల్ పోయినట్లు తేలగా అక్కడి పోలీసులు నిందితులను అరెస్ట్ చేసినట్లు తెలిసింది.

**వివిధ రాష్ట్రాల్లోనూ కేసులు**

మారుమూల జన్నారాన్ని కేంద్రంగా చేసుకున్న నిందితులు సుమారు వెయ్యి వివిధ నెట్‌వర్క్‌ల సిమ్‌లు వాడారు. కంబోడియా నుంచి ఆపరేటింగ్ చేస్తూ పెద్ద సైబర్ నెట్‌వర్క్ నడిపారు. వీరిని డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలికమ్యూనికేషన్ సహాయంతో రామగుండం కమిషనరేట్ పోలీసులు, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల సైబర్ క్రైం అధికారులు, జన్నారం ఎస్సై అనూష సహకారంతో జూలై 30న పట్టుకున్నారు. కంబోడియాలో ఉంటున్న జాక్ అనే వ్యక్తి సూచనలతో పని చేస్తున్న మాన్యం జిల్లా పార్వతీపురానికి చెందిన కాంద్రపు కామేశ్, జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్ గ్రామానికి చెందిన బావు బాపయ్య, మధుకర్, జన్నారం మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన గొట్ల రాజేశ్ అనే నలుగురిని అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. వారిని గత నెల 30న జన్నారం ఎస్సై అనూష కోర్టులో హాజరుపరిచారు. అనంతరం వారికి బెయిల్ మంజూరైంది. అయితే వీరిపై దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో సైబర్ క్రైం కేసులు నమోదైనట్లు సైబర్‌క్రైంలో పని చేస్తున్న ఓ ఉన్నతాధికారి తెలిపారు. తమిళనాడులో 18 కేసులు, తెలంగాణలో 11 కేసులతోపాటు ఆంధ్రప్రదేశ్, అస్సాం, అరుణాచల్‌ప్రదేశ్, కేరళ, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోనూ వీరిపై కేసులు నమోదైనట్లు సదరు అధికారి ద్వారా తెలిసింది. అయితే ఢిల్లీకి చెందిన ఓ వ్యక్తిని సైబర్ నేరగాళ్లు రూ.24 లక్షలకు మోసం చేయగా, అక్కడి సైబర్‌క్రైం పోలీసులకు బాధితుడు ఫిర్యాదు చేశాడు. విచారణ జరుపుతున్న అక్కడి పోలీసులకు పట్టుబడిన సైబర్ నేరగాళ్ల విషయం సమన్వయ పోర్టల్ ద్వారా తెలియగా వారు దర్యాప్తు చేయగా కంబోడియాలో ఉంటున్న జాక్ సూచనలతో వీరి ప్యానల్ ద్వారానే సైబర్ క్రైం జరిగినట్లు గుర్తించారని తెలిసింది. ప్రస్తుతం చంచలగూడ సెంట్రల్‌జైలులో ఉన్న నిందితులపై ఢిల్లీలోనూ కేసు నమోదైనట్లు సమాచారం. చిన్న గ్రామంలో సైబర్ నేరాలు ప్రారంభించిన నిందితులు దేశవ్యాప్తంగా నేరాలకు పాల్పడగా వారిపై వివిధ రాష్ట్రాల్లో కేసులు నమోదు కావడం సంచలనం సృష్టించింది. త్వరలో మరిన్ని సంచలన నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉందని, మరి కొందరినీ అరెస్ట్ చేసే అవకాశముందని సదరు అధికారి 'సాక్షి'కి తెలిపారు. ఈ విషయమై జన్నారం ఎస్సై అనూషను సంప్రదించగా, నిందితులను హైదరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసిన మాట నిజమేనని ధ్రువీకరించారు.

# పనులు త్వరగా పూర్తిచేయాలి

- కలెక్టర్ కుమార్ దీపక్
- భవన నిర్మాణాల పరిశీలన
- వసతిగృహ పర్యవేక్షకులతో సమీక్ష



భీమిని: కన్నెపల్లిలో పీఎచ్‌సీ భవన నిర్మాణ పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

భీమిని: కన్నెపల్లి మండలంలో చేపట్టిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం భవన నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేసేలా అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. మంగళవారం భీమిని, కన్నెపల్లి మండలాల్లో కలెక్టర్ పర్యటించారు. భీమినిలో పీహెచ్‌సీని తనిఖీ చేశారు. మందుల నిల్వలు, ల్యాబ్, రిజిస్టర్లు, పరిసరాలు పరిశీలించారు. రోగులతో మాట్లాడి సేవల గురించి తెలుసుకున్నారు. సమయపాలన పాటిస్తూ రోగులకు అందుబాటులో ఉండి మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అనంతరం మల్లీడి గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. బిల్లులు త్వరగా మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మల్లీడిలోని నర్సరీ పరిశీలించి మొక్కల నిర్వహణ సరిగా లేకపోవడంతో పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీస్ జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భీమిని, కన్నెపల్లి కేజీబీవీలను సందర్శించారు. వెనుకబడిన విద్యార్థినులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని, మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. పదో తరగతి విద్యార్థినులను పలు ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. కలెక్టర్ వెంట ఎంపీడీవోలు గంగామోహన్, శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సైలు పద్మ, శారద తదితరులున్నారు.

**భవన నిర్మాణ స్థల పరిశీలన**

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధి రాంనగర్ బస్తీలోగల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకోగా నూతన భవన నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. పాఠశాల భవన నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. శిథిల భవనాలకు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు చేయించి వాటిని వినియోగంలోకి తీసుకువస్తున్నట్లు వివరించారు.

### క్రమం తప్పకుండా తనిఖీ చేయాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: సంక్షేమ పాఠశాలలు, వసతి గృహాలను సంబంధిత అధికారులు క్రమంతప్పకుండా తనిఖీ చేసి ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. కలెక్టర్ చాంబర్‌లో గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, వసతి గృహాల పర్యవేక్షక అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. విద్యార్థుల తల్లిదండ్రులు నెలకోసారైనా వసతిగృహాన్ని సందర్శించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించాలని ఆదేశించారు. సమస్యలుంటే తక్షణమే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లాలని సూచించారు.

## క్లుప్తంగా

### ప్రభుత్వ ఉపాధ్యాయుడిపై పోక్సో కేసు

తాంసి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడిపై మంగళవారం పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై జీవన్‌రెడ్డి తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న గీతేశ్వర్ కొంతకాలంగా విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. వెకిలిచేష్టలు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. సదరు విద్యార్థినుల ఫిర్యాదు మేరకు ఉపాధ్యాయుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

### విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



మృతి చెందిన ఎద్దు

ఇంద్రవెల్లి: విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. దొడందా గ్రామంలోని మెస్రం తుల్సీరాం అనే రైతుకు చెందిన ఎద్దు మంగళవారం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో మేత మేస్తుండగా ఎర్తింగ్ వైర్‌కు తాకడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందింది. ఎద్దు విలువ రూ.40 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు. కాగా విద్యుత్ శాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే ఎర్తింగ్ వైర్‌కు విద్యుత్ సరఫరా కావడంతో ఎద్దు మృతి చెందిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

### దాడి కేసులో ఇద్దరి రిమాండ్



నిందితుల అరెస్టు చూపుతున్న ఎస్సై

కాసిపేట: మండలంలోని కోమటిచేను గ్రామంలో రాంటెంకి శివరాంపై దాడి చేసిన ఘటనలో అదే గ్రామానికి చెందిన జాడి రవి, అతని కుమారుడు జాడి సాయికుమార్‌ను మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గత నెల 25న రాత్రి శివరాంపై కత్తితో దాడి చేయడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

### స్కూల్ విద్యార్థుల ఆటో బోల్తా

- ఇద్దరికి స్వల్పగాయాలు

చెన్నూర్‌రూరల్: మండలంలోని నారాయణపూర్ గ్రామ సమీపంలో పాఠశాల విద్యార్థులతో వెళ్తున్న ఆటో బోల్తా పడింది. నారాయణపూర్ నుంచి మంగళవారం తొమ్మిది మంది స్కూల్ విద్యార్థులను ఎక్కించుకున్న ఆటో బావురావుపేట సమీపంలోని ఆస్సిసి పాఠశాలకు వెళ్తుండగా మార్గమధ్యలో అదుపుతప్పి బోల్తా పడింది. గమనించిన స్థానికులు విద్యార్థులను బయటకు తీశారు. ఇద్దరు విద్యార్థులకు స్వల్పగాయాలు కావడంతో 108కు సమాచారం అందించారు. ఆటో డ్రైవర్ నిర్లక్ష్యంతోనే ఈ ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ దేవేందర్ తెలిపారు.

### ఆటో టైర్లు చోరీ



టైర్లు చోరీకి గురైన ఆటో

తాండూర్: మండలంలోని అచ్చలాపూర్‌లో సోమవారం రాత్రి ఆటో టైర్లు చోరీకి గురైనట్లు వాహన యజమాని ఏముర్ల రాకేష్ తెలిపారు. ఎప్పటిలాగే తన ఇంటి ముందు పార్కింగ్ చేశానని, రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు ఆటో మూడు టైర్లను అపహరించుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశాడు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

### నకిలీ బాబాలపై కేసులు

ఆదిలాబాద్‌టౌన్: అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి మోసాలకు పాల్పడుతున్న నకిలీ బాబాలపై కేసులు నమోదయ్యాయి. జిల్లా వ్యాప్తంగా నకిలీ బాబాల భరతం పట్టేందుకు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా మంగళవారం ఏకకాలంలో జిల్లా వ్యాప్తంగా దాడులు జరిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని బొక్కల్‌గూడకు చెందిన జుబేర్, ఖానాపూర్‌కు చెందిన ఉస్మాన్‌లపై కేసులు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. జ్వరం, ఇతర వ్యాధులతో బాధపడుతున్న వారికి తావీతులు, విభూది, నిమ్మకాలు, తదితర వాటిని ఇస్తూ వారి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బేల, ఇచ్చోడలో ఒక్కొక్కరిపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. రాత్రి వరకు ఈ దాడులు జరిగాయి.

# పర్యాటకం.. అభివృద్ధికి దూరం

- కడెం.. సహజ సౌందర్య నిలయం
- ఏడాది పొడవునా పర్యాటకుల రాక
- శిథిలావస్థకు డీలక్స్ బోటు
- మూలనపడిన స్పీడ్ బోటు
- పట్టించుకోని పర్యాటక శాఖ



మరమ్మతులకు నోచుకోని స్పీడ్ బోటు



బోటింగ్ చేస్తున్న పర్యాటకులు (ఫైల్)



బోటింగ్ పాయింట్ వద్ద పర్యాటకులు

కడెం: సహజ సిద్ధమైన ప్రకృతి అందాలకు నిలయంగా నిలిచిన కడెం ప్రాజెక్టు, రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందింది. 2010లో పర్యాటక శాఖ బోటింగ్‌ను ప్రవేశపెట్టడంతో పర్యాటకుల సంఖ్య క్రమంగా పెరిగింది. ఈ అందమైన ప్రాజెక్టును తిలకించేందుకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తున్నారు. అయితే, పెరిగిన పర్యాటకుల సంఖ్యకు తగ్గ సౌకర్యాలు లేకపోవడంతో సందర్శకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వం కడెంను పర్యాటక హబ్‌గా అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**పర్యాటక కేంద్రంగా..**

2010లో బోటింగ్ ప్రవేశపెట్టినప్పటి నుంచి కడెం ప్రాజెక్టు పర్యాటక రంగంలో గణనీయమైన ఆదరణ పొందింది. 2015లో 12 విడిది గదులు, రెస్టారెంట్‌తో కూడిన హరిత రిసార్ట్స్‌ను ఏర్పాటు చేయడంతో ఈ ప్రాంతం మరింత ఆకర్షణీయంగా మారింది. ప్రస్తుతం హరిత రిసార్ట్స్‌ను ప్రైవేటు సంస్థలకు అప్పగించారు. పర్యాటకుల విడిది కోసం ఒక రిసార్ట్, రెండు లాడ్జీలు అందుబాటులో ఉన్నాయి. ఈ సౌకర్యాలతో కడెం రాష్ట్రంలోనే ప్రముఖ పర్యాటక కేంద్రంగా రూపొందింది.

**అభివృద్ధి లేక ఇబ్బందులు..**

కడెం బోటింగ్ యూనిట్‌లో ఒక డీలక్స్ బోటు, స్పీడ్ బోటును ప్రవేశపెట్టినప్పటికీ, సౌకర్యాల నిర్వహణలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. గతంలో రూ.30గా ఉన్న బోటింగ్ టికెట్ ధరను రూ.50కి పెంచారు, కానీ సౌకర్యాలు మెరుగుపరచకపోవడంతో ఆదాయం గణనీయంగా తగ్గింది. స్పీడ్ బోటు మోటారు చెడిపోయి సంవత్సరాలు గడిచినా మరమ్మతులు చేయకపోవడంతో అది మూలన పడింది. డీలక్స్ బోటు శిథిలావస్థలో ఉన్నప్పటికీ, తాత్కాలిక మరమ్మతులతో నడుపుతున్నారు. బోటింగ్‌కు 16 మంది లేదా రూ.600 చెల్లించాల్సిన నిబంధన వల్ల చాలా మంది పర్యాటకులు నిరాశతో వెనుదిరుగుతున్నారు.

**శిథిలావస్థలో సౌకర్యాలు..**

కడెం బోటింగ్ స్టాండ్‌ను గతంలో రాత్రికి రాత్రి నాగర్‌కర్నూల్ జిల్లా సోమశీలకు తరలించారు, దాని స్థానంలో పాత స్టాండ్‌ను వదిలేశారు. ప్రస్తుతం ఈ స్టాండ్ కూడా శిథిలావస్థకు చేరింది. బోటింగ్ సిబ్బంది తాత్కాలికంగా తాళ్లు, తెప్పలతో దాన్ని నడిపిస్తున్నారు, దీంతో పర్యాటకులకు ప్రమాద భయం పొంచి ఉంది. సౌకర్యాల నిర్వహణలో నిర్లక్ష్యం వల్ల గతంలో లక్షల్లో వచ్చిన ఆదాయం గణనీయంగా తగ్గిపోయింది.

### ప్రాజెక్టు అందాలు బాగున్నాయి



కడెం ప్రాజెక్టును విజిట్ చేశాం. ప్రకృతి సిద్ధమైన కడెం ప్రాజెక్టు అందాలు బాగున్నాయి. బోటింగ్ చేశాం. ఇక్కడ ఒకటే బోటు ఉంది. స్పీడ్ బోటుతో పాటు పైడల్ బోటు లాంటివి ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

– దివ్య, పర్యాటకురాలు, రాజమండ్రి

### అభివృద్ధి చేయాలి



మిత్రులతో కలిసి కడెం ప్రాజెక్టు సందర్శనకు వచ్చాం. కడెం ప్రాజెక్ట్, పరిసర ప్రాంతాలను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయాలి. నీటి మధ్యలో ఉన్న ఐ ల్యాండ్ వరకు బోటును తీసుకెళ్తే బాగుంటుంది. ప్రాజెక్ట్‌లో వాటర్ గేమ్స్ లాంటివి ఏర్పాటు చేయాలి.

– చంద్రశేఖర్, పర్యాటకుడు, విజయవాడ

# శిశుమందిరాల్లో విద్యతోపాటు క్రమశిక్షణ

- ఎమ్మెల్యే రామారావు పటేల్
- రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే

భైంసాటౌన్: విద్యార్థులకు విద్యతోపాటు క్రమశిక్షణ, భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, దేశం పట్ల భక్తిభావన పెంపొందించడంలో సరస్వతి శిశు మందిరాలు విశేష కృషి చేస్తున్నాయని ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని కిసాన్ గల్లి శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో మంగళవారం రాష్ట్రస్థాయి ఖేల్‌కూద్ పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో విద్యాపీఠం ప్రాంత అధ్యక్షుడు తిరుపతిరావు, సంఘటన కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రాంత శైక్షనిక్ ప్రముఖ్ కృష్ణమాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

# నేతకాని కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న దుర్గం రాజేశ్

దండేపల్లి: నేతకానీలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన నేతకానీ మహర్ సంక్షేమ సంఘం మండల సమావేశానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో ప్రత్యేక కోటా ప్రకటించాలని, నామినేటెడ్ పదవుల్లో ప్రత్యేక స్థానం కల్పించాలని, స్థానిక ఎన్నికల్లో 50 శాతం సీట్లు కేటాయించాలని కోరారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర అధికార ప్రతినిధి గోళ్ల రాజమల్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రకాశ్, నర్సయ్య, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు యువరాజు, జిల్లా అధ్యక్షుడు రాంబాబు, నాయకులు శ్రీనివాస్, రాములు, రాజలింగు, పోశన్న, తదితరులు పాల్గొన్నారు.

# గిత్తే కార్తీక్‌కు ఆర్థికసాయం



శివాజీ ప్రతిమ బహూకరిస్తున్న సీడీ చౌహాన్

కెరమెరి: హిమాచల్ ప్రదేశ్‌లోని స్పీటీ వ్యాలిలో ఈ నెల 9నుంచి 19 వరకు నిర్వహించే మౌంట్ యూనమ్ పర్వతారోహనకు కుమురంభీం జిల్లా కెరమెరి మండలంలోని కెలికే గ్రామానికి చెందిన మౌంటేనీయర్ గిత్తే కార్తీక్ ఎంపికయ్యాడు. సికింద్రాబాద్‌కు చెందిన గ్లోబల్ హిందూ ఫెడరేషన్, ఛత్రపతి శివాజీ మహరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు, చైర్మన్ సీడీ చౌహాన్ మంగళవారం ఛత్రపతి శివాజీ ప్రతిమతో పాటు రూ.20 వేల ఆర్థికసాయం అందజేశారు. సాహసయాత్ర పూర్తి చేసుకున్నాక మరో రూ.30 వేలు అందించనున్నట్లు ప్రకటించారు. కాగా కార్తీక్ హైదరాబాద్‌లోని ఏఐఎంఎస్ కాలేజీ ఆఫ్ హోటల్ మేనేజ్‌మెంట్, క్యాటరింగ్ టెక్నాలజీలో విద్యాభ్యాసం చేస్తున్నాడు. భారత రక్షణ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అడ్వాన్స్‌డ్ మౌంటనీరింగ్ కోర్సును గతంలో పూర్తి చేశాడు. ఎన్నో సాహస కృత్యాల్లో పాల్గొని అవార్డులు సొంతం చేసుకున్నాడు.

# దాడికి పాల్పడిన వ్యక్తి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శశిధర్‌రెడ్డి

రామకృష్ణాపూర్: రామకృష్ణాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగిడి భవానీ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఈ నెల 3న ఓ యువకుడిపై దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడు పంగ శ్రీధర్‌ను మంగళవారం అరెస్టు చేసినట్లు మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి, పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గద్దెరాగిడికి చెందిన ఊటూరి హరీష్ భవానీ బార్ దగ్గర ఉండగా అక్కడే ఉన్న శ్రీధర్ తనకు మద్యం ఇప్పించాలని కోరగా నిరాకరించడంతో మహేందర్, తిరుపతి అనే మరో ఇద్దరు స్నేహితులతో కలిసి దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీధర్‌ను అరెస్టు చేసి అతనిపై రౌడీషీట్‌కు కూడా ఓపెన్ చేశామని, పరారీలో ఉన్న మరో ఇద్దరిని త్వరలోనే పట్టుకుంటామని సీఐ తెలిపారు.


# పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య



నీలిమ (ఫైల్)

మంచిర్యాలక్రైం: పురుగుల మందు తాగి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యులు, ఎస్సై మజారొద్దీన్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని భగవంతంవాడకు చెందిన గోపు సత్యనారాయణ, భారతమ్మ దంపతుల కుమార్తె నీలిమ (37)కు గద్దెరాగడికి చెందిన లారీ డ్రైవర్ మానేం రాజేందర్‌తో వివాహమైంది. దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. సదరు మహిళ కొంతకాలంగా కడుపు నొప్పి, గర్భసంచి సమస్యలతో బాధపడుతోంది. పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాకపోవడంతో మనస్తాపానికి గురైంది. ఇటీవల తల్లిగారింటికి వచ్చింది. ఈ నెల 3న పురుగుల మందు తాగడంతో గమనించిన కుటుంబ సభ్యులు ముందుగా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి మంగళవారం మృతి చెందింది. మహిళ తండ్రి సత్యనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### ఆర్థిక ఇబ్బందులతో యువకుడు..



గణేశ్ (ఫైల్)

దండేపల్లి: ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై తహసీనొద్దీన్ తెలిపిన వివరాల మేరకు నంబాల గ్రామానికి చెందిన కొండ గణేశ్ (32), ప్రవళిక దంపతులు కూలీపని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారికి ఇద్దరు పిల్లలు సంతానం. ఇద్దరూ కష్టపడి పనిచేస్తున్నా కుటుంబ అవసరాలకు డబ్బులు చాలడం లేదని గణేశ్ పలుమార్లు భార్యతో చెప్పుకుంటూ బాధపడేవాడు. ఈక్రమంలో మంగళవారం కూలీ పని నిమిత్తం ప్రవళికను బైక్‌పై తీసుకెళ్లి గ్రామ సమీపంలోని పత్తిచేను వద్ద దింపి వెళ్లాడు. మధ్యాహ్నం నంబాల బ్రిడ్జివద్ద పురుగుల మందు తాగి విషయాన్ని సోదరుడు రమేశ్‌కు ఫోన్‌చేసి చెప్పడంతో వెంటనే లక్సెట్టిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రవళిక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

**రైలు కిందపడి ఒకరు..**

కాగజ్‌నగర్‌టౌన్: రైలు కిందపడి ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌గౌడ్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని కాపువాడకు చెందిన మహ్మద్ షబ్బీర్ (52)మద్యానికి బానిసై ఇంట్లో కుటుంబ సభ్యులతో తరచూ గొడవ పడుతుండేవాడు. దీంతో మనస్తాపానికి గురై మంగళవారం తెల్లవారుజామున రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద బెల్లంపల్లి నుంచి బల్లార్షాకు వెళ్లే గూడ్స్ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు.

**భుక్తాపూర్‌లో యువతి..**

ఆదిలాబాద్‌టౌన్: ఉరేసుకుని యువతి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలోని భుక్తాపూర్‌లో చోటు చేసుకుంది. ఉట్నూర్‌కు చెందిన మౌనిక (25) ఆదిలాబాద్ పట్టణంలోని ఓ చెప్పుల దుకాణంలో పనిచేస్తూ భుక్తాపూర్‌లోని ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. సాయంత్రం షాపు నుంచి ఇంటికి వెళ్లిన యువతి ఉరేసుకుని అఘాయిత్యానికి పాల్పడినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు. పోస్టుమార్టమ్ నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

**భార్య కాపురానికి రావడం లేదని ఒకరు..**



కార్తీక్ (ఫైల్)

మందమర్రిరూరల్: భార్య కాపురానికి రావడం లేదని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. ఏఎస్సై మజీద్‌ఖాన్ తెలిపిన వివరాల మేరకు మందమర్రిలోని రెండవ జోన్‌కు చెందిన సింగరేణి కార్మికుడు శనిగారపు కార్తీక్ (30)కు హనుమకొండకు చెందిన లాస్యతో 2018లో వివాహమైంది. దంపతులకు కుమారుడు ఆర్యన్ (7), కూతురు ఆరాధ్య (5) ఉన్నారు. కుటుంబంలో గొడవలు జరగడంతో నెలరోజుల క్రితం లాస్య పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురై సోమవారం రాత్రి ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయకపోవడంతో మంగళవారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు ఇంటికి వెళ్లి చూడగా ఉరేసుకుని కనిపించాడు. మృతుని అన్న సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

### కడెం కాలువలో గుర్తుతెలియని మృతదేహం

దస్తురాబాద్: కడెం ఎడమ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. మల్లాపూర్ గ్రామ సమీపంలోని కడెం ఎడమ కాలువలోని ముళ్లపొదల్లో మంగళవారం మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించారు. పూర్తిగా కుళ్లిపోయి ఉందని, మృతునికి 45 నుంచి 55 సంవత్సరాల వయస్సు ఉంటుందని తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### ఎరుకల సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా ఓదెలు



నియామకపు పత్రంతో ఓదెలు

రామకృష్ణాపూర్: ఎరుకల ప్రజా సమితి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా రామకృష్ణాపూర్ పట్టణానికి చెందిన రేవెల్లి ఓదెలును ఎన్నుకున్నారు. మంగళవారం శ్రీరాంపూర్‌లో జరిగిన సమావేశంలో సమితి రాష్ట్ర అధ్యక్షుడు తిరుపతి నియామకపత్రం అందజేశారు. ఎరుకల ప్రజల అభివృద్ధి కోసం, ఎరుకల జాతి చైతన్యం కోసం తనవంతు కృషి చేస్తానని ఓదెలు ఈ సందర్భంగా పేర్కొన్నారు.

### జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



ఎంపికైన హాకీ క్రీడాకారులు

ఆదిలాబాద్: జాతీయ స్థాయి జూనియర్ హాకీ పోటీలకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికై నట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, పార్థసారథి తెలిపారు. ఆదిలాబాద్ ప్రభుత్వ గిరిజన డిగ్రీ కళాశాలకు చెందిన కొడప ప్రదీప్, వెట్టి సుదర్శన్ ఎంపికయ్యారని, ఈ నెల 12 నుంచి పంజాబ్‌లోని జలంధర్‌లో జరిగే పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహిస్తారని వివరించారు.

### ఒకరిపై గంజాయి కేసు

ఇంద్రవెల్లి: మండలంలోని దనోరా(బి)లో ఒకరిపై గంజాయి కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయన్న తెలిపారు. గ్రామానికి చెందిన పరశురాం తన ఇంటి పెరట్లో గంజాయి మొక్కలు సాగు చేసినట్లు తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం తనిఖీలు నిర్వహించగా 23 గంజాయి మొక్కలు లభ్యమైనట్లు తెలిపారు. మొక్కలను ధ్వంసం చేసి నిందితునిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

# అల్లుడిని హతమార్చిన అత్త

- కర్రతో తలపై బాది గొంతునులిమి హత్య
- ముధోల్ మండలంలోని తరోడలో ఘటన



షేక్ నజీమ్ మృతదేహం

తానూరు(ముధోల్): అత్త చేతిలో అల్లుడు హతమైన సంఘటన నిర్మల్ జిల్లా ముధోల్ మండలంలోని తరోడలో చోటు చేసుకుంది. సీఐ మల్లేశ్ తెలిపిన వివరాల మేరకు మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా హిమాయత్‌నగర్‌కు చెందిన షేక్‌నజీమ్(45) కుటుంబం పదేళ్ల క్రితం ముధోల్ మండలంలోని తరోడలో నివాసం ఉంటోంది. ఇటుకబట్టీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. నజీమ్ అత్తగారైన రహీమున్నీసా వారితో కలిసి ఉంటోంది. వర్షాకాలం కావడంతో ఇటుకల తయారీ పనిలేక పోవడంతో మృతుని భార్య షేక్ సాహెబి ఈనెల 2న శనివారం మహారాష్ట్రలోని శివాని గ్రామానికి మేస్త్రీ పనికోసం వెళ్లింది. ఈ నెల 4న తెల్లవారు జామున నజీమ్ మద్యం సేవించి వచ్చి అత్తను లైంగికంగా వేధించడమే కాకుండా ఆమెపై చేయి చేసుకున్నాడు. అదే రోజు సాయంత్రం 6 గంటలకు మద్యం మత్తులో ఉన్న నజీమ్ మళ్లీ ఆమెతో గొడవపడడంతో కర్రతో తలపై దాడిచేసి గొంతునులిమి హత్య చేసింది. మంగళవారం ఉదయం స్థానికులు అందించిన సమాచారం సీఐ మల్లేశ్ సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుని భార్య షేక్ సాహెబి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితురాలు రహీమున్నీసాను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి



కూనారపు వంశీ(ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి పోలీసుస్టేషన్ పరిధిలోని అందుగులపేట మేడారం ఫ్లై ఓవర్ బ్రిడ్జి సమీపంలో సోమవారం రాత్రి 10.30గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో కూనారపు వంశీ(32) మృతిచెందాడు. మందమర్రి ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. డోర్నకల్‌కు చెందిన వంశీ తన భార్య స్వాతితో కలిసి ద్విచక్ర వాహనంపై అత్తగారి ఊరైన తాండూర్‌కు వెళ్తున్నాడు. అందుగులపేట వద్ద ద్విచక్ర వాహనాన్ని నిలిపి ఉంచగా.. వెనుక నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా వచ్చిన లారీ ఢీకొట్టింది. దీంతో వంశీ తీవ్రంగా గాయపడ్డాడు. మంచిర్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య స్వాతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. వంశీకి భార్య స్వాతి, కుమారుడు ఉన్నారు.

### బావిలో పడి వృద్ధుడు..



మల్లయ్య (ఫైల్)

బజార్‌హత్నూర్: ప్రమాదవశాత్తు బావిలో పడి వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సంజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని కాండ్లి గ్రామానికి చెందిన పట్ల మల్లయ్య (60) కొంతకాలంగా మతిస్థిమితం కోల్పోయి తిరుగుతున్నాడు. సోమవారం గ్రామ సమీపంలోని వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో మృతి చెందాడు. మృతుని భార్య పట్ల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

### రోడ్డు ప్రమాదంలో ఒకరు..

నేరడిగొండ: మండలంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇచ్చోడ మండలం సల్యాద గ్రామానికి చెందిన చిక్రం సోమేష్ (23) మృతి చెందినట్లు ఎస్సై ఇమ్రాన్ తెలిపారు. ఇచ్చోడ మండలం సల్యాదకు చెందిన చిక్రం సోమేష్, తొడసం హన్మంతు ద్విచక్ర వాహనంపై నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం రాయాదరికి వెళ్లి వస్తుండగా ఆరేపల్లి–కొరటికల్ జాతీయ రహదారి మధ్యలో ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టారు. చిక్రం సోమేష్ అక్కడికక్కడే మృతి చెందగా తొడసం హన్మంతుకు తీవ్రగాయాలయ్యాయి. మృతుని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు

- ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వన్యప్రాణుల వేటగాళ్ల కోసం జిల్లా వ్యాప్తంగా పది ప్రత్యేక బృందాలతో తనిఖీలు చేపట్టి నాలుగు కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నిందితుల నుంచి ఒక డబుల్ బోర్‌గన్, ఒక ఎయిర్‌గన్, జింక కొమ్ములతో కూడిన తల, రెండు జింక కొమ్ములు, కత్తులు, టార్చ్‌లైట్లు, వేట సామగ్రి, వైర్లు, బరిసెలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1, మావల పోలీసు స్టేషన్‌లో 2, తాంసి పోలీసు స్టేషన్ పరిధిలో 1 కేసు నమోదు చేసినట్లు తెలిపారు. వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో ఆదిలాబాద్ పట్టణంలోని పంజేషా మొహల్లాకు చెందిన షోయబ్ అఫ్జల్ వద్ద ఒక డబుల్ బోర్‌గన్, జింక తల, రెండు జింక కొమ్ముల ముక్కలు, వేటకు ఉపయోగించిన సామగ్రి, కత్తులు, జాకెట్లు, షూలు లభించినట్లు చెప్పారు. మావల మండలంలోని వాగాపూర్‌కు చెందిన ఆత్రం మారుతి, ఆత్రం భీంరావు వద్ద 50 మీటర్ల జీవైర్, నైలన్ మెష్, జంతువులను వేటాడే సామగ్రి, ఒక ఈటె, ఎలక్ట్రిక్ వైర్ లభించినట్లు తెలిపారు. తాంసి మండలంలోని ఘొట్కురికి చెందిన షేక్ షరీఫ్ వద్ద ఎయిర్‌గన్ లభించినట్లు పేర్కొన్నారు. వారిపై ఆయా పోలీసుస్టేషన్లలో కేసులు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. సమావేశంలో ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి, వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్, మావల సీఐ కర్రె స్వామి, ఎస్సై ఇసాఖ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.